క్లుప్తంగా

వీఐటీలో పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ



పీఈఎస్ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

యాదమరి: తమిళనాడులోని వేలూరు వీఐటీలో యాదమరి మండలం మోర్దానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు విశేష ప్రతిభ కనభరిచారు. ఆదివారం వీఐటీలో నిర్వహించిన గణితం, సైన్స్, కామర్స్ సబ్జెక్టుల్లో విశేష ప్రతిభ కనబరచడంతో వారికి బహుమతులు అందించారు. విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంపై దాడి అమానుషం

చిత్తూరు కార్పొరేషన్: చెన్నైలోని టీ నగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంపై కొందరు దుండగులు రాళ్లు, మద్యం సీసాలతో దాడి చేయడం అమానుషమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ చెన్నైలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సమావేశమైన సమయంలో దాడి చేయడం శోచనీయమన్నారు. దాడి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి పోలీసులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

రెండు నెలలుగా ఎస్‌ఐ పోస్టు ఖాళీ



గుడిపాల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు నెలలుగా ఎస్‌ఐ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇది వరకు ఎస్‌ఐగా ఉన్న రాజశేఖర్ తిరుపతి జిల్లా అలిపిరికి ఆగస్టు 21న బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి ఎస్‌ఐ పోస్టు ఖాళీగానే ఉంది. ఇంతవరకు ఎస్‌ఐని నియమించకపోవడంతో కేసులన్నీ పెండింగ్‌లో నిలిచిపోయాయి. గ్రామాల్లో అక్కడక్కడ ఘర్షణలు జరుగుతుండడంతో అదుపు చేయడానికి అధికారాలున్న పోలీసు లేకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టి సారించి స్టేషన్‌కు ఎస్‌ఐని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు తగ్గువారిపల్లెలో సురక్ష వైద్య శిబిరం

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య ప్రారంభం అవుతుందన్నారు. గ్రామ సచివాలయం పరిధిలోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంధత్వ నివారణే లక్ష్యం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: అంధత్వ నివారణే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జైన్ సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ పేర్కొన్నారు. చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీజైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్.వి అరవింద ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 198 మంది హాజరు కాగా 98 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వారికి ఉచితంగా అన్ని రకాల సేవలు అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్ చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు అందజేస్తున్న సత్యా ఫౌండేషన్ డైరెక్టర్ క్రిష్ణయ్య

కార్వేటినగరం: పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టడమే సత్యా ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ డైరెక్టర్ కె.క్రిష్ణయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాదిరికుప్పం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాదిరికుప్పం, గోపిశెట్టిపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు పేదలు 50 మందికి చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ..అనాథ శరణాలయాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వృద్ధాశ్రమాలకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు సత్యవేణి, పాస్టర్ చార్లెస్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.



మంచు కురిసే వేళలో..





చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి మంచు మొదలైంది. ఆదివారం వేకువజామున దట్టమైన మంచు కమ్మేసింది. ఉదయం 7 గంటల వరకు మంచు వీడలేదు. ఈ మంచు కారణంగా వేకువజామున వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చేవాళ్లు గడప దాటలేదు. ఉదయం 10 గంటల తరువాత మండే ఎండలతో జనం ఇబ్బందులు పడ్డారు. రాత్రి 8 గంటల సమయంలో మంచు పడడంతో పాటు చలి తీవ్రత పెరిగింది.

- చిత్తూరు రూరల్

సంకటాలను హరించే చతుర్థి వ్రతం

- 1న సంకటహర చతుర్థి వ్రతం
- కాణిపాక ఆలయంలో ఆర్జిత సేవ
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు

సత్య ప్రమాణాలకు నిలయమైన కాణిపాకం శ్రీస్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకట హర చతుర్థి వ్రతానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. గణేశ పురాణంలో ఈ వ్రతానికి విశిష్ట స్థానం కల్పించారు. ఈ వ్రతాన్ని బ్రహ్మదేవుడు, మహావిష్ణువు కూడా ఆచరించారట. ఈ వ్రతం ఆచరిస్తే విద్య, ఆరోగ్యం, వివాహం, సంతానం, వ్యాపార అభివృద్ధి, సకల దోషాలు పరిహరించిపోయి ఆనందాలు వెల్లివిరుస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆ రోజు రెండు విడతలుగా వ్రతం నిర్వహిస్తోంది. నవంబర్ 1న సంకటహర చతుర్థి నేపథ్యంలో కథనం..



వ్రతం ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

కాణిపాకం(యాదమరి): ప్రతినెలా సంకట హర చతుర్థి రోజున (పౌర్ణమి తర్వాత 4వరోజు) కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా వివిధ రాష్ట్రాల నుంచి కూడా ఈ వ్రతం ఆచరించేందుకు భక్తులు వస్తున్నారు. నవంబర్ 1న జరగనున్న సంకట హర చతుర్థి వ్రత పూజలకు దేవస్థానం విస్తృత చర్యలు తీసుకుంటోంది. ఈ వ్రతం ఆచరించేందుకు అశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తుండడంతో ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా సామూహికంగా అర్చక పండితులు శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహించేందుకు చర్యలు చేపట్టరు. భక్తులకు తగిన వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో, ఆలయం వద్ద టిక్కెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. గత నెలలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సంకట హర చతుర్థి వ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. సంకట చతుర్థి వ్రతం అంటే, సమస్తమైన సంకటాలు హరింప చేసే మహిమాన్వితమైన పూజ అని తెలిపారు. శ్రీ గణేశ పురాణం, ఉపాసనా ఖండం 68వ అధ్యాయం నుంచి 71 అధ్యాయం వరకు పేర్కొన్న వ్రత విశిష్టను ఉపదేశించారు.

అందుబాటులో టికెట్లు

నవంబర్ 1వ తేదీన ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు పర్యాయాలు సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులు ఒక్కొక్కరు రూ.350 చెల్లించి టికెట్ తీసుకోవాలి. టికెట్లు ఆన్‌లైన్‌లో, ఆలయం వద్ద కౌంటర్‌లో లభిస్తాయి.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు



నవంబర్ 1న నిర్వహించే సంకటహర చతుర్థి వ్రతానికి ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేపట్టాం. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పిస్తున్నాం. భక్తులు ఎంతమంది వచ్చినా టికెట్లు అందుబాటులో ఉంటాయి.

-మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్

వ్రతం రోజున స్వర్ణ రథం



సంకటహర చతుర్థి వ్రతం రోజు సాయంత్రం స్వర్ణ రథంపై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తారు. వ్రతం ఆచరించే వారు ప్రత్యేకంగా పూజా సామగ్రిని తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. దేవస్థానమే అందజేస్తుంది.

- వెంకటేశు, ఆలయ ఈఓ

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన ఉంటుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సప్ – 98499 07885 కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు తుమ్మిందలో సురక్ష శిబిరం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలోని తుమ్మింద జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బీఎస్‌ఆర్ పేట ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వవిద్యార్థులు, గురువులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997–98 పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వవిద్యార్థులంతా ఒకే చోట చేరారు. విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆత్మీయ పలకరింపుతో యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, సరోజినీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అరవింద్, శ్యామ్, వడివేలు, గిరి, కృపానందం, మోహన్, రాజ, శ్రీధర్, శ్రీదేవి, శైలజా తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: దాదాపు పదేళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు తిరిగి ఏకమై తాము చదువుకున్న కాలేజీలో అందరూ ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి మధుర సంఘటనలను నెమరు వేసుకున్నారు. తీపి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. మండలంలోని సీఎస్‌ఆర్ కళాశాలలో ఆదివారం 2011–13 సంవత్సరంలో సీఈసీ చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. వీరందరూ ఒకచోట కలవాలని నిశ్చయించుకున్నారు. తాము చదువుకున్న కళాశాలలో కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను చర్చించుకున్నారు. అనంతరం అధ్యాపకులను కలుసుకొని వారిని సన్మానించారు.



గుడిపాల సీఎస్‌ఆర్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

సాంస్కృతిక జీవనానికి ప్రతీక సభా కథలు

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రచయిత కె.సభా కథలు రచనా వ్యాసంగం చేశారని ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కె.సభా సంస్మరణ సభ, మా కథలు–2022 కథ సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధురాంతకం నరేంద్ర, భూమన్, ఆత్మీయ అతిథులుగా పలమనేరు బాలాజీ, కృష్ణస్వామి రాజు పాల్గొన్నారు. సాకం నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, కలువగుంట రామమూర్తి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, పల్లిపట్టు నాగరాజు, కాంతారావు, సురేంద్ర రొద్దా పాల్గొన్నారు.

నేడు ఖాదీ ఫెస్ట్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: ఖాదీ వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం తిరుపతిలోని పాత వెంకటేశ్వర థియేటర్ వద్దనున్న ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఖాదీ ఫెస్ట్ ప్రారంభిస్తున్నట్లు ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో వీఆర్ విజయ రాఘవ నాయక్ తెలిపారు. ఈ ఖాదీ ఫెస్ట్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఈ ఖాదీ ఫెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు.

సమష్టిగా సప్లయ్ చానల్ నిర్మాణం



రైతులు నిర్మించుకున్న రక్షణగోడ

తవణంపల్లె: పంటపొలాలకు నీరు అందించే మేడివంక సప్లయ్ చానల్ రక్షణగోడను మరమ్మతులు చేయడానికి రైతులు నడుంబిగించారు. వివరాల్లోకి వెళితే, తవణంపల్లె, ఐరాల మండలాల్లోని సుమారు 30 చెరువులకు నీరు అందించే మేడివంక సప్లయ్ చానల్‌ను ఏర్పాటు చేశారు. అయితే మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పత్రపల్లె దగ్గర సప్లయ్ చానల్ రక్షణగోడ కోతకు గురై కూలిపోయింది. దీంతో రైతులు ఎవరిపైనా ఆధారపడకుండా తమ సొంత డబ్బుతో పనులు చేసుకోవడానికి జిల్లా రైతు సమాఖ్య ఉపాధ్యక్షులు చెర్లోపల్లె జగన్నాథరెడ్డి నేతృత్వంలో ప్రణాళిక సిద్ధం చేశారు. మండలంలోని చెర్లోపల్లె, తొడతర, ఉప్పాంక, పుత్రమద్ది గ్రామాల్లోని రైతులందరూ కలిసికట్టుగా 60 అడుగుల పొడవు, 8 అడుగుల ఎత్తుతో గోడ నిర్మించారు. సప్లయ్ చానల్లో పెరిగిన ముళ్లపొదలు, పూడిక మట్టిని తీయించి శుభ్రం చేయించారు.

గ్రామాల్లో కుక్కల బెడద



బసవాపల్లె వద్ద రోడ్డుపై కుక్కల స్వైర విహారం

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం కుక్కలబెడద అధికమవుతోంది. మండలానికి ఆనుకొని తమిళనాడు సరిహద్దు ఉండడంతో తమిళనాడు వాసులు కుక్కలను ఇక్కడ వదిలి వెళుతున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు స్థానికులు, పిల్లలు కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. రాత్రివేళ కుక్కల అరుపులకు నిద్ర పోలేకపోతున్నామని కొందరు వాపోతున్నారు. మండలంలోని నంగమంగళం, బొమ్మసముద్రం, గట్రాళ్ళమిట్ట, 197రామాపురం, వసంతాపురం, బసవాపల్లె గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలబెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేరుశనగ ఒబ్బిడిలో రైతులు బిజీబిజీ

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట ఒబ్బిడిలో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. మండలంలోని రైతులు 1,260 ఎకరాల్లో వేరుశనగ పంటను రెండు, మూడు దశల్లో సాగు చేశారు. అదునుకు వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంట బాగా దెబ్బతినింది. తర్వాత వర్షాలు కురిసినా ఆశించిన దిగుబడి రాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో, అడవి జంతువుల దాడులతో పంటలను కాస్త దెబ్బతీశాయి. మండలంలో ముందస్తుగా సాగు చేసిన రైతులు పంటను ఒడుపుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు 9 నుంచి 12 బస్తాలు దిగుబడి వస్తున్నదని రైతులు తెలిపారు.

పందులు, కోతుల బెడద

మండలంలో పంటలు సాగు చేయడానికి పందులు, కోతులు బెడద అధికంగా ఉంది. అడవుల్లో ఉండే జంతువులు గ్రామాల్లోకి చొరబడి పంటలను నాశనం చేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రాయితీ కింద వేరుశనగ విత్తనాలు సరఫరా చేయడంతో పాటు పంట సాగుకు పెట్టుబడి కోసం రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి రైతులకు ఆదుకుంటోంది. ఏనుగులు, పందులు, కోతులు పంటలపై దాడి నష్టపరచడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎకరాకు వేరుశనగ దిగుబడి 12 బస్తాలు

ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఎకరాకు 9 నుంచి 14 బస్తాల వేరుశనగ దిగుబడి వస్తోంది. ఒక్కొక్క పొలంలో ఒక్కో రకంగా దిగుబడి వస్తోంది. రైతుల పొలాల్లో వేరుశనగ దిగుబడిని పరిశీలించగా 3.5 కిలోల నుంచి 5.5 కిలోల వరకు దిగుబడి వచ్చినట్లు తేలింది. మండలంలో ముందుగా సాగు చేసిన రైతులు పంటను ఒడుపుతున్నారు.





పొలాల్లో వేరుశనగ కాయలను వేరు చేస్తున్న రైతు కూలీలు, వేరుశనగ దిగుబడిని తూకం వేసి నిర్ధారిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఘనంగా వెక్కాళీయమ్మన్ వార్షికోత్సవం



అమ్మవారి సేవలో ఇందుమతి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తమ్మింద గ్రామంలో వెలసిన శ్రీ వెక్కాళీయమ్మన్ వార్షిక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో విశేష పూజలు, పాలాభిషేకం చేశారు. గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ మహోత్సవానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి సతీమణి ఇందుమతి హాజరయ్యారు. ఆమెకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజని, నాయకులు కుమార్, మధురెడ్డి, మణిబాబు, రాజేంద్ర, వెంకటేశులు, తులసి గ్రామస్తులు పాల్గొన్నారు.

వినియోగదారుల సౌకర్యార్థం టవర్ల ఏర్పాటు

గంగాధర నెల్లూరు: వినియోగదారుల సౌకర్యం కోసమే మారుమూల ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పాచిగుంట వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న టవర్ పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం తూగుండ్రం గ్రామం సమీపంలో టవర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవ, స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా టవర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. అదే విధంగా ఫైబర్ నెట్ కనెక్షన్ ద్వారా రూ.399, రూ.499, రూ.599 కనెక్షన్‌లు పొందితే ఇంటర్నెట్, కాల్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు. డివిజనల్ ఇంజినీర్ సురేంద్రనాథ్, సబ్ ఇంజినీర్ శ్రీనివాసులు, జేటీఓ సిద్దయ్య, జేఈ నర్సింహా రెడ్డి, జీవారత్నం పాల్గొన్నారు.